క్లుప్తంగా

మండల పరిషత్ కార్యాలయంలో 'నా భూమి - నాదేశం'



తెనాలిటౌన్: కొత్తపేట మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం మేరాదేశ్–మేరామట్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కార్యాలయ ఆవరణాన్ని రంగులతో, పూలతో అలంకరణ చేశారు. మండల గ్రామాల్లో కలశాల్లో సేకరించిన మట్టిని సిబ్బంది కార్యాలయానికి తీసుకువచ్చారు. ఈసందర్భంగా ఎంపీడీఓ విజయాలక్ష్మణ్ మాట్లాడుతూ 18 గ్రామాలనుంచి తెచ్చిన మట్టిని ప్రభుత్వం ఇచ్చిన ఇత్తడి కలశంలోఉంచి గుంటూరులోని జిల్లాపరిషత్ కార్యాయానికి చేరుస్తామని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలనుంచి తెచ్చిన మట్టిని ప్రత్యేక రైలులో ఢిల్లీకి తీసుకెళతామని ఎంపీడీఓ తెలిపారు. ఈఓపీఆర్డీ సుభాష్‌చంద్ర బోస్, కార్యాలయ ఏఓ వి.ప్రతాపరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



తెనాలిటౌన్: మండల రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి తహసీల్దార్ కె.రవిబాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ వారంలో ప్రతి మంగళవారం సమావేశం నిర్వహిస్తున్నామని, బూత్ లెవల్ అధికారుల ద్వారా బూత్‌లలో ఉన్న ఓటర్ల వివరాలను నాయకులు తెలుసుకోవాలని తెలిపారు. ఓకే డోర్ నంబర్లో ఉన్న ఓటర్ల వివరాలు, ఓటర్ జాబితాలో మార్పులు, చేర్పులపై తెలియజేయాలని కోరారు. సమావేశంలో పార్టీల నాయకులు తాడిబోయిన రామయ్య(వైఎస్సార్ సీపీ), శిఖా రవీంద్ర(బీజేపీ), పొన్నూరు నాగసూర్య శిధరరావు(కాంగ్రెస్), మట్లపూడి సాంబశివరావు(బీఎస్పీ), బాబూ ప్రసాద్(సీపీఎం), కేసన కోటేశ్వరరావు(టీడీపీ)లు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో విదేశాలకు పార్సిల్స్



ఫిరంగిపురం: అతి తక్కువ ఖర్చుతో పోస్టల్ ద్వారా విదేశాలకు పార్సిల్ సేవలు అందిస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ అన్నారు. మండల కేంద్రంలోని హెడ్ పోస్టాఫీసులో నేషనల్ పోస్టల్ వారోత్సవాల సందర్భంగా మంగళవారం వివిధ పథకాలపై వినియోగదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కత్తిరేణమ్మ మాట్లాడుతూ పోస్టల్‌లో ప్రజలకు ఉపయోగపడే పలు బీమా పథకాలు ఉన్నాయని చెప్పారు. పీఎల్ఐ, ఆర్‌పీఎల్ఐ వంటి పథకాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. అంతేకాక సేవింగ్ పథకాలు అయిన ఎస్‌బీ, ఆర్‌డీ, టీడీవంటి వాటి ద్వారా ప్రజలకు పోస్టల్ ఎంతో ప్రయోజనకరమైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెనాలి ఎక్సైజ్ ఎస్ఐ మందాళ అనిత, చిలుకలూరిపేట పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సతీష్, పోస్టుమాస్టర్ ఫణీంద్ర, ఎస్‌పీఎంలు, బీఎంఎస్‌లు, ఏబీఎంస్‌లు వినియోగదారులు పాల్గొన్నారు.

బీమా చెక్కు పంపిణీ



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకులో మంగళవారం కేర్ హెల్త్ ఇన్సూరెన్స్, యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ప్రమాద బీమా చెక్కు అందజేశారు. యూనియన్ రిన్ సురక్షలో రూ.1499 చెల్లించి ప్రమాదవశాత్తూ మృతి చెందిన పి.జ్యోతి కుటుంబ సభ్యులకు రూ.5లక్షల ప్రమాద బీమా చెక్కు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ జైజీవన్, బ్రాంచి మేనేజర్ ఇ.రాధికలు అందజేశారు. జైజీవన్ మాట్లాడుతూ యూనియన్ రిన్ సురక్ష పథకం ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ బీమా పథకంలో చేరాలన్నారు. కార్యక్రమంలో కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ ఏరియా హెడ్ నాగార్జున, ఏఏహెచ్ కె.కిరణ్‌కుమార్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి సీఎం జగనన్న భరోసా

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- చినరావూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం ప్రారంభం



చినరావూరు సురక్ష క్యాంప్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. చినరావూరులోని కమ్యునిటీ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను ఆయన పరిశీలించారు. స్పెషలిస్ట్ వైద్యులు ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా ఇచ్చారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరు ఆరోగ్యంగా ఉండాలనే గొప్ప ఆలోచనతో ప్రభుత్వం దీనిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎంతో ఖర్చుతో కూడిన వైద్యాన్ని సైతం ఇక్కడ ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కమిషనర్ ఎం.జశ్వంతరావులు మాట్లాడుతూ జనరల్ ఓపీ 176, సర్జన్ ఓపీ 98, ఫిజీషియన్ ఓపీ 82, ఆప్తమాలజీ ఓపీ కింద 181 మంది పరీక్షలు చేయించుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు కొర్రా యశోదా, షేక్ దుబాయ్‌బాబు, పేరం సంజీవరెడ్డి, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, కఠారి హరీష్, ఎలిజబెత్ రాణి, దేవరపల్లి కిషోర్ కుమార్, అక్కిదాసు కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో అందరికీ వైద్యం

అన్నవరం(కొల్లిపర): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలందరికీ ఉచితంగా వైద్యసేవలు అందుతున్నాయని ఎంపీడీఓ వి.విజయలక్ష్మి, డాక్టర్ ప్రియాంక తెలిపారు. మంగళవారం అన్నవరం సచివాలయం పరిధిలో హనుమాన్‌పాలెంలోని ప్రాథమిక పాఠశాలల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సచివాలయం పరిధిలో 374 మంది రోగులు శిబిరంలో పాల్గొన్నారు. వీరిలో 102 మందికి రక్తపరీక్షలు చేసి, మిగిలిన వారికి వివిధ వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 40 మందిని శస్త్ర చికిత్సలకు వివిధ కార్పొరేట్ హాస్పటల్‌కు సిఫార్సు చేసినట్లు మున్నంగి పీహెచ్‌సీ డాక్టర్ ప్రియాంక తెలిపారు. పీహెచ్‌సీ డాక్టర్ లక్ష్మిసుధ, ఈఓపీఆర్డీ శంకరరావు ఎంపీటీసీ తుమాటి భీమారాణి పాల్గొన్నారు.



మెడికల్ క్యాంప్‌లో పేర్లు నమోదు చేయించుకుంటున్న మహిళలు



జగనన్న సురక్ష క్యాంప్‌లో వేచి ఉన్న రోగులు

కొలకలూరులో...

తెనాలిటౌన్: పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. రూరల్ మండలం కొలకలూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సందర్శించారు. శిబిరంలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఎమ్మెల్యే సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుబ్బారావు పర్యవేక్షణలో వైద్యులు దిలీప్, రాధిక, మన్మథకుమార్‌లు రోగులకు వైద్యపరీక్షలు చేశారు. బీపీ, షుగర్, ఈసీజీ, రక్తపరీక్షలు జరిపారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.అనంతరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ తెనాలి ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాల్స్‌ను ఏర్పాటుచేశారు. స్టాల్స్‌ను ఎమ్మెల్యే శివకుమార్ పరిశీలించారు. ఎంపీడీఓ విజయాలక్ష్మణ్, సీడీపీఓ ఎం.సునీత, తహశీల్దార్ కె.రవిబాబు, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు చెంచుపేటలో మెడికల్ క్యాంప్..

తెనాలిఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను బుధవారం చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. 35, 36, 37, 47 వార్డు సచివాలయాల పరిధిలోని ప్రజలకు ఇక్కడ వైద్యసేవలు అందించటం జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెడికల్ క్యాంప్ కొనసాగుతుందని చెప్పారు. ఈఅవకాశాన్ని ఆయా సచివాలయాల పరిధిలోని ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు.

కేవీలో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉచిత శిక్షణ

తెనాలి: స్థానిక జగ్గడిగుంటపాలెంలోని కేంద్రీయ విద్యాలయలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై 4.0) పథకంలో భాగంగా డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. స్కిల్ డెవలప్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్ మంత్రిత్వశాఖ సౌజన్యంతో ప్రతిరోజూ రెండు గంటల చొప్పున మొత్తం 300 గంటల శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. పదోతరగతి పాసైనవారు తర్వాత ఇతరత్రా కారణాలతో చదువును కొనసాగించలేని వారికి ఇదొక మంచి అవకాశమని తెలిపారు. గృహిణులు, నిరుద్యోగులు, ఇతరులు సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని సూచించారు. శిక్షణ కోరువారికి ఆధార్ ఈకేవైసీ తప్పనిసరిగా స్పష్టంచేశారు. మిగిలిన వివరాలకు కేంద్రీయ విద్యాలయ వెబ్‌సైట్ http://tenai.kvr.ac.in చూడాలని లేదంటే ఆర్.రామిరెడ్డి టీజీటీ (ఏఈ)–9048483423ను సంప్రదించాలని వివరించారు.

బాలిక అదృశ్యం



అంకమ్మ(ఫైల్)

తెనాలిరూరల్: మైనర్ బాలిక అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ మారీసుపేట చైతన్యనగర్‌కు చెందిన 12 ఏళ్ల అంకమ్మ తలిదండ్రులు మృతి చెందడంతో పెద్దమ్మ వద్ద ఉంటోంది. సోమవారం రాత్రి దుకాణానికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన బాలిక తిరిగి రాలేదు. బంధువులు మంగళవారం పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసినట్టు త్రీ టౌన్ ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

కట్నం వేధింపులపై కేసు

తెనాలిరూరల్: కట్నం కోసం భర్త, అత్తింటి వారు వేధింపులకు గురి చేస్తుండడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణబాలాజీరావుపేటకు చెందిన అఫ్రోజ్ తనను భర్త మౌలాలి, అతని కుటుంబసభ్యులు అధిక కట్నం తెమ్మంటూ మానసిక, శారీరక వేధింపులకు గురి చేస్తున్నారని త్రీ టౌన్ పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు.

మానసిక రోగులు తారసపడితే సమాచారమివ్వాలి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది ఖాదర్ హుస్సేన్

తెనాలిరూరల్: రోడ్లపై, ఇతర ప్రాంతాల్లో ఎవరి సంరక్షణలో లేని మానసిక రోగులు తారసపడితే వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో సమాచారమివ్వాలని మండల న్యాయసేవాధికార సంస్థ ప్యానల్ న్యాయవాది షేక్ ఖాదర్ హుస్సేన్ సూచించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తెనాలి మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బాలాజీరావుపేటలోని భవిత కేంద్రంలో న్యాయ విజ్ఞాన సదస్సును మంగళవారం నిర్వహించారు. న్యాయవాది ఖాదర్ హుస్సేన్ మాట్లాడుతూ తనను తాను సంరక్షించుకోలేని స్థితిలో విచ్చలవిడిగా తిరుగుతున్న మానసిక రోగిని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్ అదుపులోకి తీసుకుకి 24 గంటల్లో మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచాల్సి ఉంటుందని చెప్పారు. రోగి పరిస్థితిని పరిశీలించిన న్యాయమూర్తి మానసిక వైద్యశాలకు పంపే అవకాశముంటుందన్నారు. అలానే రోగిని సంరక్షించేందుకు గార్డియన్‌ను నియమించడంతో పాటు అతని ఆస్తులను పరిరక్షించేందుకు మేనేజర్‌నూ మేజిస్ట్రేట్ నియమిస్తారని తెలిపారు. సరైన లైసెన్సు లేకుండ మానసిక చికిత్సాలయాన్ని నిర్వహించడం, వైద్యం అందించినట్టు తెలిస్తే రెండు నెలల వరకు జైలు శిక్ష రూ. 200 జరిమానా విధిస్తారని తెలిపారు. న్యాయవాది గుమ్మడి రవిరాజు, పారా లీగల్ వలంటీర్ రవీంద్ర, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది మహబూబ్, విజయ్, భవిత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయశాస్త్రంలో మార్పులపై అవగాహనకు సదస్సు దోహదం



సదస్సును ప్రారంభిస్తున్న పి.భాస్కరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు

తాడేపల్లిరూరల్: న్యాయ శాస్త్రంలో చోటుచేసుకుంటున్న మార్పుల పట్ల అవగాహన కల్పించడానికి ఇలాంటి సదస్సులు దోహదపడతాయని కేఎల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ అన్నారు. వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో మంగళవారం మేధో సంపత్తి హక్కులపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షులు పొట్లూరి భాస్కరరావు హాజరయ్యారు. వర్మ మాట్లాడుతూ యూనివర్సిటీలో న్యాయ కళాశాల అధ్యాపకులకు, విద్యార్థులకు ఉపయోగపడే మేధో సంపత్తి హక్కుల గురించి అవగాహన కల్పించడానికి ఈ సదస్సును ఏర్పాటు చేశామని అన్నారు. ప్రతి వ్యక్తికి ఉండే మేధోసంపత్తి పట్ల హక్కులను కలిగి ఉండాలని అన్నారు. జపాన్, కెనడా, శ్రీలంక, మార్టియస్ వంటి పలు దేశాల నుంచి 250 మంది పైగా నిపుణులు, విద్యావేత్తలు పాల్గొని విద్యార్థులకు మేధో సంపత్తి హక్కుల గురించి అవగాహన కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఫెసిలిటేషన్ సెంటర్ అధిపతి డాక్టర్ రాఘవరావు, ఎంహెచ్‌ఎస్ అంతర్జాతీయ సంబంధాల డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు, కెఎల్ న్యాయ కళాశాల విభాగాధిపతి విజయసుధ, ప్రొఫెసర్ డాక్టర్ కామసాయి తదితరులు పాల్గొన్నారు.

కుష్టు, బోధ వ్యాధిగ్రస్తుల పిల్లల చదువులకు ఆర్థికసాయం



విద్యార్థులకు ఆర్థికసాయం చెక్కుల పంపిణీ

తెనాలి: స్థానిక తెనాలి డబుల్‌హార్స్ మినపగుళ్ల సంస్థ సౌజన్యంతో నిరుపేద కుష్టు, బోధ వ్యాధిగ్రస్తుల పిల్లలు 10 మందికి చదువుల నిమిత్తం రూ.80 వేలు పంపిణీ చేశారు. స్థానిక పాత ప్రభుత్వ వైద్యశాలలో ఒక్కొక్కరికి రూ.8 వేల చొప్పున చెక్కులను అందజేసినట్టు లెప్రా సొసైటీ రాష్ట్ర సమన్వయకర్త రాధిక తెలియజేశారు. తెనాలి డబుల్‌హార్స్ సంస్థతో కలిసి తమ సంస్థ తెనాలి మండలంలో బోధ వ్యాధిగ్రస్తుల సంక్షేమం కోసం పనిచేస్తున్నట్టు ఆమె తెలిపారు. లెప్రా సొసైటీ సంస్థ ప్రాజెక్ట్ అసోసియేట్ అబ్దుల్ వహీద్‌బాషా, సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. లెప్రా సొసైటీ, తెనాలి డబల్ హార్స్ సహకారంతో బోధవ్యాధిగ్రస్తులకు స్వయం సంరక్షణా పద్ధతులు, వారికి అవసరమైన బ్యాండేజీలు, ఆయింట్‌మెంట్స్ అందుతున్నాయని రవికుమార్ చెప్పారు. డబుల్‌హార్స్ సంస్థకు, లెప్రా సొసైటీకి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఓఆర్ డబ్ల్యూఓ రమణయ్య, మలేరియా, ఫైలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాల సందర్శన



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న సమగ్ర శిక్ష రాష్ట్ర ఉర్దూ పరిశీలకులు షేక్ అబ్దుల్ ఘని

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని నులకపేటలో ఉన్న ఉర్దూ పాఠశాలను మంగళవారం సమగ్ర శిక్ష రాష్ట్ర ఉర్దూ పరిశీలకులు షేక్ అబ్దుల్ ఘని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఉర్దూ పాఠశాలలో చదివే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల భౌతిక వసతులు, విద్యార్థుల హాజరు, జీవీకె తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ షేక్ జిలాని మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి పాఠశాలకు 12 కుర్చీలను అందజేయడం సంతోషంగా ఉందని, ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంతోషానికి తొలిమెట్టు మానసిక ఆరోగ్యం

తాడేపల్లిరూరల్: సంతోషమైన జీవితానికి తొలిమెట్టు మానసిక ఆరోగ్యమేనని, మానసిక ఆరోగ్యం బాగుంటే మనలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, ప్రతికూల పరిస్థితులను అధిగమించే శక్తి లభిస్తుందని నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు అన్నారు. మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం తాడేపల్లిలోని చిగురు బాలల గ్రామంలో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యాన ఆటల పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మానసిక సమస్యలు ఎక్కువగా కనిపిస్తే విజయవాడ పెజ్జోనిపేటలోని నీతోడు మానసిక వికాస కేంద్రం (9490492020)ను సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో చిగురు బాలల గ్రామం ఇన్‌చార్జి జోష్న, నవజీవన్ బాలభవన్ జోనల్ కో ఆర్డినేటర్స్ ఎస్‌కె నజ్మా, సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ

ఏఎన్‌యూ: యూనివర్సిటీ స్టూడెంట్ కౌన్సెలింగ్ సెంటర్, ఎడ్యుకేషన్ విభాగం సంయుక్తంగా మంగళవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా 'మన మనసు - మన హక్కులు' అనే నినాదంతో ఉన్న పోస్టర్‌ను వీసీ పి.రాజశేఖర్ ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులు, ఉద్యోగుల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఎడ్యుకేషన్ విభాగాధి పతి డాక్టర్ బ్రహ్మాజీరావు, డాక్టర్ వైఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.సిద్ధయ్య పాల్గొన్నారు.

మేరా మట్టి... మేరాదేశ్ ర్యాలీ



ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు అరుణ

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మేరా మట్టి–మేరాదేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి అరుణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ మేరా మట్టి–మేరా దేశ్ కార్యక్రమాన్ని చేపట్టారని, మనం మన మట్టిని కాపాడుకోవాలి, ప్లాస్టిక్ వ్యర్థాలతో నేలతల్లిని నింపుతున్నామని, భావితరాలకు ఇది మంచిది కాదని అన్నారు. నేల సారవంతంగా ఉంటేనే పంటలు బాగా పండుతాయని, రసాయన ఎరువులతో నేలను పాడుచేయవద్దని, సేంద్రియ ఎరువులతో నేలను కాపాడుకోవాలని అన్నారు. అందరిచేత ప్రతిజ్ఞ చేయించిన అనంతరం పంచాయతీ కార్యదర్శులు, విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరిటెండెంట్ దేవరపల్లి వీరయ్య, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు లక్ష్మి, మణికంఠ, శరత్, వెంకటరావు, రామలింగేశ్వరరావు, బాపయ్యచౌదరి, ఎంపీటీసీ సభ్యులు కొండూరు సుమన్, ఆత్మకూరు నాగేశ్వరరావు, పలుకూరు శామ్యూల్, డ్వాక్రా సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అందరూ రాకుంటే ప్రజా సమస్యలపై చర్చించేదెలా!

- మండల పరిషత్ సమావేశంలో సభ్యుల ఆవేదన
- అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం



వివిధ విభాగాల ప్రగతి నివేదికలను తెలియజేస్తున్న అధికారులు

తాడికొండ: మండల పరిషత్ సమావేశానికి అన్ని విభాగాలకు చెందిన అధికారులు అందుబాటులో ఉండాలని, అరకొరగా అధికారులు హాజరు కావడంతో ప్రజా సమస్యలపై చర్చించాలంటే కుదరడం లేదని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు కోరారు. మంగళవారం తాడికొండ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మి అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ మండలంలో విద్యుత్ లోవోల్టేజీ సమస్య తీవ్రంగా ఉందని, విద్యుత్ స్తంభాలు పడిపోయి ఉండటం, చిన్నపాటి సమస్యలకు సిబ్బంది అందుబాటులో లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని బండారుపల్లి సర్పంచ్ ముప్పాళ్ల మనోహర్, తాడికొండ సర్పంచ్ తోకల సరోజినీ నరసింహారావు అన్నారు. తాడికొండ జగనన్న కాలనీలో రెండో సైట్‌లో నిర్మాణాల కోసం గృహ నిర్మాణ శాఖాధికారులు అనుమతులు మంజూరు చేశారని, కానీ అక్కడ తాగునీరు ఇతర వసతులు లేని కారణంతో ప్రారంభించలేని పరిస్థితి ఉందని చెప్పగా తాగునీటి వసతి కల్పించేందుకు రూ.1.34 కోట్లు నిధులు మంజూరయ్యాయని, పనులు ప్రారంభం కానందున తాత్కాలికంగా నీటి సరఫరా అందిస్తామని తాగునీటి సరఫరా విభాగం ఏఈ తెలిపారు. సర్వసభ్య సమావేశానికి పోలీసు, వ్యవసాయ శాఖల అధికారులు అసలు రావడం లేదని, కారణంగా సమస్యలు చర్చించడం ఎలా అని ప్రశ్నించారు. వ్యవసాయ శాఖ నుంచి అందుతున్న రాయితీలు, విత్తనాలు, ఎరువుల సరఫరాపై ప్రజాప్రతినిధులకే అవగాహన లేకుంటే ప్రజలకేం చెప్పాలో మీరే సూచించండి అన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక పాలన అందరికీ చేరవేయాలంటే ప్రజాప్రతినిధులకు అధికారులు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. వచ్చే సమావేశంలోఅన్ని విభాగాలకు చెందిన అధికారులు సర్వసభ్య సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని లేకుంటే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రతి ఒక్కరూ ఆరోగ్య శిబిరంలో పరీక్షలు నిర్వహించుకునేలా అన్ని శాఖల అధికారులు సమష్టిగా పని చేసి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో తమ వంతు పాలుపంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గుడిమెట్ల జ్యోతి, వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి, ఎంపీడీవో అత్తోట దీప్తి, డిప్యూటీ తహసీల్దార్ కాకుమాను ప్రసాద్ పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యమే మహోన్నత శక్తి



తాడేపల్లిరూరల్: మానసిక ఆరోగ్యమే మహోన్నత శక్తికి మూలమని ప్రముఖ మానసిక వైద్య నిపుణురాలు మానస అన్నారు. వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో మంగళవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మానస మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మానసిక ఆరోగ్యం నిమిత్తం జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మానసిక ఆరోగ్యం సాధించిన వారు అత్యుత్తమమైన శక్తిని పొంది విజేతలుగా నిలబడతారని వివరించారు. వర్సిటీ సైకాలజిస్ట్ ఎం.విజయరత్నం మాట్లాడుతూ శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకునే వారు విజేతలవుతారని అన్నారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, మహిళా అభివృద్ధి సెల్ కన్వీనర్ డాక్టర్ కె.రూతు రమ్య, వాల్యూ ఎడ్యుకేషన్ సెంటర్ సైకాలజిస్ట్ శంకర్, తేజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు మందులు పంపిణీ

ఫిరంగిపురం: బిడ్డకు జన్మనిస్తూ ఏ తల్లీ మృతి చెందరాదని, జన్మిస్తూ ఏ బిడ్డా మృతి చెందకూడదనే నినాదంతో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ యోజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఫిరంగిపురం సెక్టారు వైద్యురాలు పి.ఎస్తేరురాణి అన్నారు. మండలంలోని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పీఎస్ఎంఎస్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు వివిధ రకాల పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఎస్తేరురాణి మాట్లాడుతూ గర్భిణులు ఐదో నెల నుంచి ప్రసవించేంత వరకు ప్రతినెలా పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. అందులో హైరిస్క్ ఉన్న వారిని గుర్తించి తగిన జాగ్రత్తలు పాటించేలా అవగాహన కల్పిస్తామని చెప్పారు. మెరుగైన వైద్యం కోసం పెద్ద వైద్యశాలలకు రిఫర్ చేస్తామన్నారు. రక్తహీనత ఉన్న వారిని గుర్తించి వారికి ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్లు విడతల వారీగా చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.